
హాస్య కథ



మా ఇంట్లో ఇంగ్లీషు దిన పత్రిక తెప్పిస్తాము.

రాజకీయ రంగంలో వస్తున్న మార్పులు తెలుసుకోడానికి నేను పేపరు చదువుతూ వుంటాను

మా అబ్బాయి స్పోర్ట్సు పేజీ చూస్తూ వుంటాడు.

మా అమ్మాయి ఏ థియేటర్‌లో ఏ సినిమా మారుతోందో, సంగీత కచేరీలు, నాటకాలు ఏమున్నాయో తెలుసుకోడానికి పేపరు మీద ఆధార పడుతుంది.

ఇక మా ఆవిడ 50 శాతం తగ్గింపు ధరలు,

# రిడక్షన్ సేల్

15 రూపాయలకు చీర ప్రకటనల కోసమే పేపరు చూస్తుంది.....

ఆ రోజు శుక్రవారం.షాపింగ్ చేసే వారి కోసం దిన పత్రికకి ప్రత్యేక అనుబంధం వుంటుం ది. అందుకే ఆ రోజు పేపరు రావడంతోనే మా ఆవిడ దాని మీదకి దాడి చేసింది. నిమిషంలో మా ఆవిడకి కావలసింది దొరికిందేమో "ఏమండీ" అంటూ కేక వేసింది. అటువంటి కేకలకి అనేక సంవత్సరాలుగా అలవాటు పడిన నేను ఏదో కొంప మునిగిపోయిందని భయపడలేదు.

"ఏమిటి" అన్నాను.

పేపరు పట్టుకుని పరిగెత్తుకుని వచ్చినట్లు నడుస్తూ నా దగ్గరకి వచ్చి "చూడండి" అంటూ ప్రకటన చూపించింది.

ప్రసిద్ధ మిల్లుల తయారీ, 50 శాతం తగ్గింపు ధరతో 15 రూపాయలకే చీరలు! ప్రకటన చూపించడమే కాక చదివి వినిపించింది కూడా.

"సరే సాయంత్రం వెళ్దాం" అన్నాను, తగ్గింపు ధరల నుంచి తప్పించుకోలేమన్నవిషయం తెలిసిన నేను.

సాయంత్రం ఇంటి దగ్గర నుంచి బయలు దేరాము.

ఒక ప్రసిద్ధ బట్టల దుకాణం అడుగు భాగంలో అంటే సొరంగంలో ఆ 'సేల్స్' పెట్టారు. ఆ సొరంగంలోకి ప్రవేశించాము.


ఫ్యాన్లు తిరుగుతున్నా అక్కడున్న వాళ్ళు, కొన డానికి వచ్చిన వాళ్ళ చెమటలు కారుస్తున్నారు. అయినా అందరూ తమ పనులలో నిమగ్నమయి పోయారు.

బల్లల మీద కుప్పలు కుప్పలుగా చీరలు. ప్రతి కుప్పమీద దాని అమ్మకపు ధర అట్టమీద రాసి వేళ్ళాడ కట్టారు.

"పదిహేను రూపాయల చీరలు అయిపోతాయి అవి పూర్తి చేసుకుని మిగిలిన బల్లల దగ్గరకి వెళ్దాము అంది మా ఆవిడ.

"సరే" అన్నాను.

పదిహేను రూపాయల చీరల బల్ల దగ్గర వున్న పెద్ద గుంపులో దూరి పది చీరలు బయటకు పట్టుకు వచ్చింది. కావలసిన పొడవు, వెడల్పు వున్నాయో లేదో చూసుకోవడం, చిరుగులు లేవని నిర్ధారణ చేసుకోవడం చీరలుకొనే ఆడవాళ్ళకి వుండవలసిన ఉత్తమ గుణాలు. అలా తెచ్చిన చీరల విషయంలో నా సహాయంతో పని పూర్తి చేసి వాటిని మడిచి వాటికి నన్ను కాపలా పెట్టింది మా ఆవిడ.



పేదపరిశ్రమ

"సినిమా పరిశ్రమ చాలా పేదదై పోతోందిరా" అన్నాడు అమాయకం.

"ఎందుకు!" అడిగాడు వినాయకం.

"ఎందుకా! ఏ సినిమాలోనైనా హీరోయిన్ ఒంటినిండా బట్ట కట్టుకోవడం చూశావా!" మళ్ళీ ప్రశ్నించాడు అమాయకం.

—రాయవరపు రవి, రామాయంపేట



5

ఇంతలో తన భార్యతో అక్కడకు వచ్చిన వెంకట్రావు మరో బల్ల దగ్గర కనిపించేసరికి చెయ్యి ఊపాను.

"ఎవరండీ" అడిగింది మా ఆవిడ.

"ఆయన వనితల పత్రికకు ఎడిటర్" అని చెప్పాను.

"ఎందుకయినా మంచిది వాళ్ళింటి ఫోన్ నెంబర్ నోట్ చేసుకోండి" అంది మా ఆవిడ. చాలా ముందుచూపుగల ఆడది మాఆవిడ!

"ఆయన ఆఫీస్ ఫోన్ నెంబర్, ఇంటి ఫోన్ నెంబర్ రెండూ నాదగ్గరవున్నాయి" అని చెప్పాను

పదిహేను రూపాయల చీరలు, 50 శాతం

**తాజీప్రసాద్**

తగ్గింపు చీరలు సమృద్ధిగా కొనుక్కుని మా ఆవిడ బయలుదేరింది. వెనుక నేను కట్టలతో బయట పడ్డాను.

"బిల్లు తీసుకున్నారా" అడిగింది మా ఆవిడ.

"బిల్లు లాంటిది ఇవ్వరు. ఒకసారి కొన్న చీరలు మార్చుకోడానికి వీలులేదు. చీరలు తీసు కుని డబ్బు వాపసు ఇవ్వరు. అది వాళ్ళ రూలు". అని కాస్త ధైర్యంతోనే చెప్పాను.

ఆ చీరల కట్టలు తీసుకుని బస్‌లో ఇంటికి బ్రతుకు జీవుడా అని చేరుకున్నాము. ఆటో డబ్బులు ఆదా చేసుకున్నామనే సంతృప్తి నాకు మిగిలింది.

ఇంటికి చేరుకున్నాక అమ్మాయి సహాయంతో చీరలని మా ఆవిడ గాడ్రెజ్ బీరువాలో సర్దింది.

చీరలు కొనడం, దాచడం, ఆ తర్వాత కట్టడం వరుస క్రమంలో పూర్తయ్యాయి. చీరలని ఉతికే అధ్యాయం కూడా పూర్తయింది.

అప్పుడు మా ఆవిడ "వనితల పత్రిక ఎడిటర్ గారి ఇంటి ఫోన్ నెంబరు, వాళ్ళావిడ పేరూ చెప్పండి" అని అడిగింది.

చెప్పాను.

ఫోన్ చేసి "ఏమండి మణిమేఖల గారా. నమస్కారం" అంటూ తనని పరిచయం చేసుకుని "మా ఆయనా, మీ ఆయనా ఫ్రెండ్స్. ఆ మధ్య సారంగం లాంటి ప్రదేశంలో, గుహ అనాలేమో అక్కడ రిడక్షన్ ధరలో చీరలు కొన్నప్పుడు కలుసుకున్నాం." అంటూ తొలి పరిచయాన్ని గుర్తుకు తెచ్చింది మా ఆవిడ.

"అలాగా ఏమిటి విశేషం" అంటూ ఆవిడ అడిగినట్లుంది.

"అదే ఆనాళ కొన్న చీరలు ఎలా వున్నాయి" అని అడిగింది మా ఆవిడ....

....సావుగంట తర్వాత ఫోన్‌కి రెస్ట్ లభించింది.

"ఏమండీ" అంటూ నా దగ్గరకి చేరింది మా ఆవిడ.

"చూడండి! పదిహేను రూపాయల చీరలు ఒక్కసారి నేను కట్టి వుతికే సరికి కర్చీవ్ గుడ్డల సైజ్‌కి మారిపోయాయి. ఇక 50 శాతం తగ్గింపు చీరలు ఒక్కసారి కట్టి తడిపేసరికి పూర్తి ట్రాన్స్ పరెంట్ చీరల లాగా తయారైపోయాయి. ఎలా కట్టనండీ. అందుకే ఆవిడకి ఫోన్ చేశాను. తనకూ అలాగే జరిగిందని ఆవిడ వర్ణనలతో వివరించి నన్ను ఓదార్చింది." అంటూ కంట నీరు పెట్టుకుం టూ చెప్పింది మా ఆవిడ.

తానే ఆ కన్నీళ్లు తుడుచుకుని "అయినా ఒక్కసారి అక్కడకి వెళ్ళి చీరలని వాడికి చూపిద్దాం" అంది మా ఆవిడ.

"అది వన్ డే సేల్స్. ఈ పాటికి వాడు ఏ అలహాబాదులోనో, అహమ్మదాబాదులోనో వుంటాడు లాభం లేదు. విచారించకు." అని మా ఆవిడని ఓదార్చాను.

"సరే రేపటి నుంచి పేపరు ముట్టుకోను. ముట్టుకున్నా షాపింగ్ పేజీ చూడను. చూసినా వండర్ ఫుల్ రిడక్షన్ సేల్స్ చూడను. వన్ డే రిడక్షన్ సేల్స్ చూడను. చూసినా అక్కడకు వెళ్ళను. వెళ్ళినా చచ్చినా కొనను" అంటూ పేపర్ మీద ఒట్టు వేస్తూ మాఆవిడ చెప్పింది.

మా ఆవిడ ప్రతిజ్ఞ ఎంతకాలం నిలుస్తుందో కాని ఆ రోజు పేపరు చూసేసరికి నా గుండెల్లో రాయి పడింది. పై నెల నుంచీ పేపరు చందా నెలకి పది రూపాయలు పెరుగుతోంది!

●

హరికథ

"రాత్రి హరిదాసు భారతం ఎంతవరకు చెప్పాడు?" హనుమంతు గుణవంతు నడిగాడు.

"ఆ చెప్పాడు లెద్దూ! కౌరవుల గురించి చెబుతూ నూరు మంది పేర్లు చెప్పేసరికి తెల్లారి పోయింది!" సమాధానం చెప్పాడు గుణవంతు.

—రాయవరపు రవి, రామాయంపేట

# అణిముత్యాలు

ఇది అసలు సిసలైన ఆరుద్ర మార్కు పద్యం. పఠాభిచేత ప్రభావితుణ్ణయ్యానని ఆరుద్రే చెప్పుకొన్నాడు. ఆ ప్రభావం ఇందులో కొంత కనబడుతుంది. 1953 ఏప్రిల్ 10వ తేదీ 'జమీన్‌రైతు' వారపత్రికలో అచ్చయిన ఈ పద్యం ఆరుద్ర కవితా సంకలనంలోగానీ మరేకవితా సంపుటిలోగానీ చేరలేదు—

## చాలా వుందిలేకథ

*లెంపకాయ కొట్టినట్టు*
*లేచి నడ్డది నే 'ఎ'ర్ర కెరటం!*
*దానిమీద సవ్వారీ చేస్తూంది*
*దారితప్పిన నా 'ఆ'త కిరీటం!*
*మొగలాయి సామ్రాజ్యంగా నడ్డదా కెరటం*
*మూతి పళ్ళు విరిగితే వెంటనే కిరీటం*
*గుమాషింకునా షాపులో కట్టించుకుంది పళ్ళు*
*పళ్ళంటే కట్టించుకుందిగాని*
*హూనమైంది నోళ్ళు*
*సరే ఈ కథకేం గాని—*
*మన్నడి దగ్గర రోడ్డువార సంసారం*
*చూశావా?*
*ఈ మధ్యనే ఇక్కడ ఆకలి శతదినోత్సవం*
*చేసుకుంది.*
*దాహానికిమటుకు యాభయ్యారోజానందుగ*
*ఎత్తున ఎగిరే బావుటా సాక్షిగా*
*ఎండిపోతున్న చంద్రుడుకాస్త*
*మబ్బుచాటయ్యాక*
*గుటుక్కుమంది ఎవరంటే ఏం చెప్పను*
*ఒక ప్రాణి*
*చెంపకాయ కొట్టినట్టు చెట్టంత కెరటం*
*చెత్తా చెదారంతోపాటు కొట్టుకొచ్చింది శవం.*
*సరే ఈ కథకేంగాని—*
*కెరటంలో కొట్టుకొచ్చిన కిరీటం*
*ఇంపీరియల్ బ్యాంకిలో నద్దు మొదలెట్టింది*
*ఇన్‌కమ్‌టాక్సు మటుకూ ఎగ్గొట్టింది*
*చాలావుందిలే కథ — రేపురాత్రి చెప్తా!*

—ఆరుద్ర

సేకరణ: "సి. గోపి"